


www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 30 | మే | 2025
పేజీలు 8

# అంతా బరాబర్

- ధాన్యం కొనుగోళ్లు..చెల్లింపుల్లో ఇబ్బందులు లేవు
- సజావుగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక
- భూ భారతిపై పూర్తిస్థాయిలో అవగాహన
- సమీక్షలో పాల్గొన్న మంత్రులు భట్టి, తుమ్మల, కోమటిరెడ్డి, పొంగులేటి




**ప్రజాపక్షం/ఖమ్మం :** అంతా బరాబర్ ఉమ్మడి ఖమ్మంజిల్లాకు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు, భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు, విత్తనాలు, ఎరువులు తదితర అంశాలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేవని ఇరు జిల్లాల కలెక్టర్లు తేల్చి చెప్పారు. సమీక్ష సందర్భంగా మంత్రులు పలు అంశాలకు సంబంధించి కలెక్టర్లు పూర్తి వివరణ ఇచ్చారు. గురువారం ఖమ్మం ఐడివోసిలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి, ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి పాటిల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లలో ఎటువంటి ఇబ్బంది లేదని కొనుగోళ్లు పూర్తి చేయడం తో పాటు చెల్లింపులు కూడా పూర్తి చేసినట్లు ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

మిగతా 2లో..

## నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు
-మంత్రి కోమటిరెడ్డి



నకిలీ విత్తనాలకు సంబంధించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ విత్తనాల ద్వారా రైతులు నష్టపోవడానికి వీలు లేదని జిల్లా ఇంచార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నకిలీ విత్తనాలపై తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని నూటికి నూరు శాతం అర్హులైన పేదలకు ఇండ్లు దక్కాలని ఆయన సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

## కొరత రాకుండా చూసే బాధ్యత కలెక్టర్లదే
-మంత్రి తుమ్మల





ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లదేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. విత్తనాల కొరత రాకుండా రైతులకు ఏ విత్తనాలు అవసరమో ఆ విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. విత్తన నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జిల్లాలో ఎటువంటి బకాయిలు లేవని ఆయన తెలిపారు.

## అనుభవంలో ఉన్న అసైన్‌మెంట్‌కు పట్టాలు
-మంత్రి పొంగులేటి



అసైన్‌మెంట్ భూములకు సంబంధించి వాస్తవ సాగులో ఉన్న వారికి, నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వ ఆలోచనగా ఉందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులకు సూచించారు. జూన్ మూడు నుంచి 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో తహసీల్దార్ల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించాలని మంత్రి ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అనర్హులకు ఎక్కడైనా ఇండ్లు మంజూరు చేస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు
-ఎమ్మెల్యే కూనంనేని



ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పేదలకే ఇండ్లు మంజూరు చేయాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సూచించారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి కొలతలను ప్రభుత్వం సవరిస్తే బాగుంటుందని సూచించారు. పేదలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు సామాగ్రి తక్కువ ధరకు పేదలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని చోట్ల ట్రాక్టర్ యజమానులను అధికారులు వేధిస్తున్నారని ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. ధాన్యంలో తరుగు పేరుతో రైసు మిల్లుల వద్ద కోత విధిస్తున్నారని ఇది సరికాదని దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

# అభివృద్ధిలో రాజీపడేది లేదు..



- మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- కమ్యూనిస్టు పార్టీ సలహాలు సూచనలతో ప్రభుత్వం ముందుకు..
- మంత్రి దనసరి అనసూయ సీతక్క
- రూ.6.5 కోట్లతో హై లెవల్ వంతెనకు శంకుస్థాపన

2లో

# ఇక కొత్తగూడెం కార్పోరేషన్



- జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఫలించిన కూనంనేని కృషి
- కమిషనర్‌గా సుజాత



2లో

# అంతా బరాబర్

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ జితేష్ సైతం ఇదే సమాచారం ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఖమ్మంజిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి 845 ఇండ్లకు గాను 30 ఇండ్లు చివరి దశకు చేరుకున్నాయని మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణం పైలెట్ ప్రాజెక్టు క్రింద పనులు ప్రారంభమయ్యాయన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఖమ్మంజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ 1.21లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేసి బోనస్‌తో సహా చెల్లింపులు పూర్తి చేశామన్నారు. నకిలీ విత్తనాలకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రానున్న సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆసుపత్రులను సిద్ధం చేసినట్లు కలెక్టర్ సమీక్షా సమావేశంలో వెల్లడించారు.

**ప్రాధాన్యత కార్యక్రమాలను పూర్తి చేయండి : భట్టి**

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రాధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోళ్లు, ఆరోగ్య ప్రణాళిక, ఖరీఫ్ సాగు తదితర అంశాలకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. కల్తీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఎవరు కల్తీ విత్తనాలు విక్రయించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి దేశంలో ఎక్కడలేనివిధంగా 3,500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మొత్తం రాష్ట్రంలో రూ. 22.500 వేల కోట్లతో 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ధరణి పేరుతో రైతులు ఎదుర్కొన్న ఇబ్బంది పునరావృతం కారాదని ఆయన అధికారులకు సూచించారు. రైతులకు భూ భారతిపై అవగాహన కల్పిస్తూ భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. జూన్ రెండున రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించారు. సమీక్షా సమావేశంలో ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, శాసన సభ్యులు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, భద్రాద్రి కొత్తగూడెం ఎస్‌పి బి. రోహిత్‌రాజ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్త కళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రంసింగ్, అదనపు కలెక్టర్లు శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇక కొత్తగూడెం కార్పోరేషన్

**ప్రజాపక్షం/ఖమ్మం :** కొత్తగూడెం కార్పోరేషన్ ఏర్పాటు ప్రక్రియ ముగిసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను కలిపి కార్పోరేషన్‌గా ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వివరాలను వెల్లడించారు. కొత్తగూడెం మున్సిపాలిటీలోని 97337 మంది పాల్వంచ మున్సిపాలిటీలోని 87721 మంది, సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీల పరిధిలోని 11124జనాభా కలిపి మొత్తం 198182 జనాభాతో కొత్తగూడెం నూతన కార్పోరేషన్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గతంలో నే కార్పోరేషన్‌గా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ గురువారం జీవోను విడుదల చేసింది. ఇప్పటి వరకు కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాతను కొత్తగూడెం కార్పోరేషన్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**ఫలించిన కూనంనేని కృషి..**

కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను కలిపి కొత్తగూడెంగా ఏర్పాటు చేయాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు చేసిన కృషి ఫలితానిచ్చింది. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు రాష్ట్రంలోనే పారిశ్రామిక కేంద్రాలుగా ప్రసిద్ధి పొందాయి. సింగరేణి బొగ్గు గనులకు సంబంధించి కొత్తగూడెం ప్రధాన కేంద్రంగా ఉంది. పాల్వంచలో కెటిపిఎస్‌తో పాటు పలు పరిశ్రమలు స్థాపించబడ్డాయి. పెరుగుతున్న జనాభా, మౌలిక వసతుల కల్పన తదితర విషయాలను దృష్టిలో ఉంచుకుని కూనంనేని కార్పోరేషన్ ఏర్పాటు ఆలోచన చేశారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి కార్పోరేషన్ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేసింది. జంట పట్టణాలు లాంటి కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను కలుపుతూ కార్పోరేషన్ ఏర్పాటు చేయడం పట్ల నియోజక వర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధిలో రాజీపడేది లేదు..





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అభివృద్ధిలో రాజీపడేదే లేదని, మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ,శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం చంచుపల్లి మండల పరిధిలోని పాతకొత్తగూడెం పెనుబల్లి గ్రామాల నడుమ రూ.6 కోట్ల 50 లక్షల అంచనాలతో హై లెవల్ వంతెనకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ బిడ్డగా మారుమూల ప్రాంతాల పరిస్థితులు తనకు తెలుసని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అనేక ఇబ్బందులు ఉన్నాయని, మారుమూల ప్రాంతాల్లో వానంకాలం వస్తే పరిస్థితులు ఏ విధంగా ఉంటాయో తెలుసని అందుకో ఆయా ప్రాంతాల్లో హై లెవల్ వంతెనలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే నేడు ఈ హై లెవల్ వంతెన శంఖుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. వాగులపై వంతెలు ఉంటే రవాణా సదుపాయం మెరుగుపడుతుందని, గర్భిణీలను అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నా ఇబ్బందులులేకుండా ఉంటుందని చెప్పారు. రోడ్డు వెసులుబాటు ఉంటే ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లోకి వచ్చి నేరుగా ప్రజా సమస్యలు తెలుకుంటారని,తద్వారా ప్రజా సంక్షేమ పథకాలు మారుమూల ప్రాంతాలకు కూడా చేరుతాయన్నారు. హై వేలు, స్కై వేలు నిర్మిస్తున్న ఆధునిక యుగంలో ప్రజాసంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలనే ఉద్దేశ్యంతోనే మారుమూల ఏజెన్సి గ్రామాలకు రోడ్లు, వంతెనలు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రాతీ గ్రామం గ్రామపంచాయితీకి, మండలంతో అనుసంధానంగా ఉండేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, సమాజంలో పేదరిక నిర్మూలకావంటే ముందు మౌళిక సదుపాయాలు మెరుగ్గా ఉండాలని చెప్పారు. మిత్రపక్షంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీ సలహాలు సూచనలతో ప్రజా ప్రభుత్వం కలిసికట్టుగా పనిచేస్తుందని, అంతా కలిసికట్టుగా పనిచేద్దామని చెప్పారు. అనంతరం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకర్గం అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో సహకరిస్తోందని, అడంగానే ప్రధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. మారుమూల గ్రామాలు అభివృద్ధి పథంలో నడవాలంటే బాహ్యప్రపంచంతో సంబంధాలు ఉండాలని, జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాకాలం వచ్చిందంటే పట్టణాలతో సంబంధాలు తెగిపోతుంటాయని, వైద్య, ఇతరత్ర సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి నివేదిలు ఇచ్చి పరిస్థితులను వివరించగానే అభివృద్ధి నిధులను పలు రకాలుగా విడుదల చేస్తున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో కొత్తగూడెం నియోజవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని, ఇప్పటికే ప్రతీ గ్రామంలోని సమస్యలను తెలుసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి ఆయాశాఖల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంకా మరికొన్ని సమస్యలను గుర్తించి వాటిపై ప్రభుత్వానికి నివేదికలు సమర్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, మారుమూల ప్రాంతాల పరిస్థితులు తెలిసిన ఆడ బిడ్డగా ప్రభుత్వం నుండి నిధులు విడుదలయ్యేలా సహకరించాలని ఆయన మంత్రి సీతక్కను కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొలగాని ప్రసాద్ సేవలు

# మరువలేనివి

**-పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన మహానీయుడు**

**-కొలగాని స్తూప ఆవిష్కరణలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని**





**ప్రజాపక్షం/ఖమ్మం :** పేదల సమస్యలపై సిపిఐ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన కొలగాని ప్రసాద్ సేవలు ఎప్పటికీ మరువలేమని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో కొలగాని ప్రసాద్ స్తూపం ఆవిష్కరణ, సిపిఐ ఏఐటియుసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బొడ్డు కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ప్రసాద్ పోలీస్, రెవెన్యూ సమస్యలు వచ్చిన స్వచ్ఛందంగా సమస్యలు ఎదుర్కొని పేద ప్రజల కోసం పనిచేశారన్నారు. దాదాపు 50 ఏళ్ల నుండి వారి కుటుంబం కమ్యూనిస్టు పార్టీలో నిబద్ధతగా పనిచేస్తున్నారన్నారు. 2009లో ఎంఎల్‌ఏగా గెలిచినప్పుడు మెజార్టీ ఓట్ల కోసం సుజాతనగర్ ప్రాంతం నుండి వచ్చాయని ఈ ప్రాంత ప్రజల అప్యాయతలు, ప్రేమాభిమానం చూపిస్తున్నారన్నారు. ఎంఎల్‌ఏగా గెలిచినప్పటి నుండి రోడ్డు, డ్రైనేజీ, బ్రిడ్జిలు, త్రాగునీరు, సాగునీరు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని ప్రస్తుతం ఒక రూ. 1.20 కోట్లతో ప్రధాన రహదారి రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీలు మంజూరు చేస్తున్నామన్నారు. కార్పోరేషన్ ఏర్పాటు జరిగినా స్థానికంగానే కార్పోరేషన్ కార్యాలయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమలు వస్తాయని పేద ప్రజలకు మెప్మా ద్వారా ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రతి ఎకరానికి సాగునీటిని అందిస్తామని, తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తామన్నారు. అనంతరం సిరిపురం సీతంపేటలో స్తూపావిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేనికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, చుంచుపల్లి మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీను, సిపిఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కుమారి హన్మంతరావు, జక్కుల రాములు, తాళ్ల వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాలూరి పాపారావు, రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు ధర్మారావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పొదిలా శ్రీనివాస్, ఏఐటియుసి మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, వీర్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంపిటిసి మూడు గణేష్, సిపిఐ నాయకులు లావుడ్యా గోపి, భూక్యా శ్రీను, కుమారి, కృష్ణ, సురేష్, కిషోర్, మహేష్, వెంకటేష్, నర్సింహారావు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జైపూర్‌లో జరుగుతున్న ఏఐటియుసి జాతీయ మహాసభల సందర్భంగా అమరులకు నివాళులర్పిస్తున్న తెలంగాణ బృందం, ఉమ్మడి జిల్లా ప్రతినిధులుగా హాజరైన శింగు నర్సింహారావు, బిజి క్లైమెంట్, నరాటి ప్రసాద్, సిహెచ్ సీతామహాలక్ష్మి , కె. సారయ్య



రంగారెడ్డి జిల్లా చేవేళ్లలో జరుగుతున్న జనసేవాదళ్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తదితరులు.

# ట్రంప్ చేతిలో కీలుబొమ్మగా మోడీ



## సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/కారేపల్లి:** ట్రంప్ చేతిలో కీలు బొమ్మగా మోడీ అమిత్ షా వ్యవహరిస్తున్నారని ఆపరేషన్ కాగారి పేరుతో అమాయక ఆదివాసీలను ఎన్కౌంటర్ పేరుతో చంపటం కేంద్ర ప్రభుత్వ హత్యలుగా చూడాల్సిన అవసరం ఉన్నదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. బుధ వారం రాత్రి కారేపల్లి మండలం మాదారం గ్రామ శాఖ మహాసభ పోత నపోయిన రవి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు అమాయక పర్యాటకులను చంపి సవాల్ విసిరిన నరేంద్ర మోడీ ప్రభుత్వం యుద్ధం పేరుతో దానికి మతం రంగు పులిమి చేసిన రాజకీయం దేశ ప్రజలు గుర్తించుకోవాలన్నారు. యుద్ధాన్ని ఆపమని ట్రంప్ చెప్పగానే యుద్ధాన్ని ఆపేమని ప్రకటన చేశారు. మరో పక్క ఈ దేశ పౌరులైన మావోయిస్టులతో శాంతి చర్చలు జరపటానికి మాత్రం కేంద్ర ప్రభుత్వం ఎందకు సుముకుత వ్యక్తం చేయడం లేదన్నారు. ట్రంప్ చెప్పాడని యుద్ధం ఆపిన మోడీ శాంతి చర్చలకు సిద్ధమన్న మావోయిస్టు మాత్రం ఎన్కౌంటర్ల పేరుతో అంతమొందించడం తీవ్రమైన చర్యని విమర్శిం చారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలకు మావోయిస్టు పిలవా లని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రబాబు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని, ఇందిరమ్మ గృహాలు, రాజీవ్ యువ వికాస్, ఎటువంటి నిబంధన లేకుండా మంజూరు చేయాలన్నారు. రైతు భరోసా కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, వెంటనే రైతు భరోసా విడుదల చేయాల న్నారు. అనంతరం గ్రామ నూతన కమిటీని 23 మందితో ఎన్నుకు న్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరా మకృష్ణ, సిపిఐ నాయకులు పాపిని సత్యనారాయణ, బట్టు సంగయ్య, పోతనపోయిన రవి, రాయల రామారావు, పోతనబోయిన సహదేవ్, పోతనబోయిన రామకోటయ్య, పాపిన్ని గోపాలరావు, బట్టు నరేష్, రాయల వెంకటేశ్వర్లు, ఎస్‌కే అమీర్, జానీ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలందరికీ పనులు కల్పించాలి



## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి
## వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు
## జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదినారాయణ

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఉపాధి హామీ కూలీలందరికీ పనులు కల్పించి, రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవ సాయ కార్మిక సంఘం బికేఎంఎయూ ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొత్తూ రులో గురువారం జరిగిన ఉపాధి హామీ పథకం కూలీల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం, కూలీల కోసం వచ్చిన పథకమని, దీనిని కాంగ్రెస్,యూపీఏ వామపక్షాల సహకారంతో తీసుకురావడం జరిగిందని, ఈ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేం దుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగానే రూ. 12 కోట్ల పని దినాలను, రాష్ట్రవ్యాప్తంగా రూ.ఆరు కోట్లకు కుదిం చిందని, రెండు పూట్ల ఫోటోలు తీసే విధానం పెట్టి, కూలీల పొట్ట కొడు తుందని దీనిని వెంటనే ఉపసంహరించు కోవాలని ఆయన డిమాండ్ చేశారు. పని కావలసిన వారందరికీ పనులు కల్పించి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని,150 రోజులు ఒక కుటుంబానికి పని కల్పించా లని, అదే విధంగా రోజు కూలి రూ.700 ఇవ్వాలని దండు ఆదినారా యణ కోరారు. ఉపాధి హామీ కులీల సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దశల వారి పోరాటం నిర్వహించనున్నట్లు దండు ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఉపాధి హామీ కూలీలు రత్నకుమారి, రమణ, వెంకటమ్మ, రామ లక్ష్మి, పావని, లక్ష్మీ కుమారి, సైదా, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిప్లొమా ఫలితాల్లో శ్రీ చైతన్య ప్రభంజనం




## - విద్యార్థులను అభినందించిన ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్లు పంచాయతీపరిధిలో గల శ్రీ చైతన్య ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ విద్యార్థులు విడుదలైన డిప్లొమా ఫలితాలలో ప్రభంజనం సృష్టిం చారు. 6గురు విద్యార్థులకు 10/10 ఎస్‌జీపిఏ, 14మందికి 9.8 ఎస్‌జీ పిఏ, 32మందికి 9ఎస్‌జీపిఏపైన సాధించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులను కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ అభినందించారు. ఎగ్జిక్యూ టీవ్ డైరెక్టర్ సాయి గీతిక, డైరెక్టర్ శ్రీ విద్య మాట్లాడారు...అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో అధ్యాపకులకు ఎప్పటికప్పుడు ఇస్తున్న శిక్షణ ద్వారానే అన్నారు. అలాగే అధ్యాపకుల బోధనలను విద్యార్థులు చక్కగా విని మంచి ఫలితాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మురళికృష్ణ, డీన్ డాక్టర్ వి సుదర్శన్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ వైశాలి, టీపిఓ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంఛార్జి కృష్ణప్రసాద్, వివిధ విభాగాల అధితపతులు, డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ చిరంజీవి, శ్రీకు మార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలను విక్రయించాలి

## - విత్తన షాపులను తనిఖీ చేసిన ఎఓ సీతారామరెడ్డి



**ప్రజాపక్షం/ తిరుమలాయ-పాలెం :** విత్తన షాపుల యజమా నులు ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని వ్యవసాయశాఖ ఎఓ సీతారామరెడ్డి, ఎస్సై కూచి పూడి జగదీష్ తెలిపారు. గురు వారం తిరమయలాయపాలెం రైతు వేదికలో విత్తన దుకాణ యజమానులతో సమావేశాన్ని నిర్వహిం చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆమోదించిన బిటి 1, బిటి 2 విత్తనాలను రైతులకు విక్రయించాలని, బిటి 3 విత్త నాలు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. విత్తన షాపులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.



రైతులు విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రశీ దులు ఇవ్వాలని, రసీదులపై డీలర్స్ సంతకం, రైతు సంతకం తీసుకోవా లని, రైతులు కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్ల వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విత్తన షాపు యజమా నులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు దుప్పట్లు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర గ్రేటర్ వాసవి క్లబ్ అధ్యక్షులు కోన శ్రీనివాస రావు, రాణి దంపతుల పెళ్లి రోజు సంద ర్భంగా మధిర పట్టణంలోని పేదలు, మున్సిపల్ కార్మికులకు, వికలాంగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేయడం జరి డింది. గురువారం కోనా శ్రీనివాసరావు దుకాణం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుట్టిన రోజు, పెళ్లి రోజు తదితర శుభ కార్యాల సమయంలో పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధిర సేవా సమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు, శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు కురువెళ్ల కృష్ణ, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కుంచం కృష్ణారావు, యర్ర లక్ష్మణరావు, దాచేపల్లి ముత్యాలు, దొడ్డ శ్రీనివాసరావు, లంకా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# జీలుగుల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధి సిద్ధినేనిగూడెం సొసైటీ పరిధిలోని రైతులు జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ కటికల సీతారామిరెడ్డి కోరారు. గురువారం సొసైటీ కార్యాలయంలో రైతులకు జీలుగులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు జీలుగులు సద్వినియోగం చేసుకోవాలని, దీని వలన రసాయన ఎరువుల ఉపయోగం తగ్గుతుందన్నారు. రైతులకు సక్రమంగా జీలుగులు అందేలా చర్యలు తీసుకోవాలని ఎఇఓ, సొసైటీ సెక్రటరీని ఆదేశించారు. అంతేకాక జీలుగులు పంపిణీ విషయాల్లో ఫీల్డ్ సర్వే చేయాలన్నారు. సుబాబుల్ రైతులకు జీలుగులు పంపిణీ చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఓ సొసైటీ సెక్రటరీ స్వప్న, సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు గుంతలు పూడ్చాలని ప్రజల ఆందోళన



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధిలోని మల్లారం రొంపిమళ్ళ గ్రా మాల మధ్య రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చేశారు. గురువారం రోడ్డుపై వాహనాలు ఆపి గుంతలను పూడ్చా లని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై భారీ వాహనాలు తిరడగం వల్ల గుంతలమయం అయిందని, ఈ గుంతల వల్ల తరచూ ప్రమాదాలు జరగుతున్నాయన్నారు. ఈ సమస్యను పట్టించుకునే నాధుడే కరువయ్యాడని, అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ గుంతలను పూడ్చాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్లారం మాజీ సర్పంచ్ ఉపేంద్ర, కొంగర రంగయ్య, మల్లారం, రొంపిమళ్ళ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అధీకృత డీలర్స్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం లోని వివిధ గ్రామాల్లో ఉన్న విత్తనాల షాప్‌లను గురు వారం సత్తుపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు వి. శ్రీనివాసరెడ్డి, స్థానిక వ్యవసాయ అధికారి ప్రసాద రాజు, స్థానిక ఎస్. ఐ. కె. వెంకటేష్, సీడ్ టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ వానాకాలంలో అవసర మైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని, నాణ్య మైన విత్తనాలను రైతులకు అందించాలని, రాత్రి వేళ ఎవరైనా గోనె సంచుల్లో ప్రత్తి విత్తనాలు తెచ్చి అమ్మితే తీసుకోరాదని, అలాగే హెచ్.టి. ప్రత్తి సాగు చేయుటకు భారత ప్రభుత్వం అను మతి లేనందున అట్టి ప్రత్తి సాగు చేసే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాంటి వారి గురించి సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచి పోలీస్‌ల సహా యంతో అటువంటి అక్రమార్కుల పై పి.డి. యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దయచేసి రైతులు అధీకృత డీలర్స్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని హితవు పలికారు.

# కొత్తూరు కుటుంబానికి సండ్ర పరామర్శ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణానికి చెందిన కొత్తూరు జాలేశ్వరరావు సతీమణి చిట్టెమ్మ ఇటీవల మృతి చెందగా విషయం తెలుకున్న సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య గురువారం వారి నివాసానికి వెళ్ళి, చిట్టెమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కొత్తూరు జాలేశ్వరరావును ఓదార్చి, దైర్యం చెప్పి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సండ్ర వెంట మాజీ పుర చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమా మహేశ్వరరావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దొడ్డా శంకర్‌రావు, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, చాంద్ పాషా, జిన్నీ తదితరులున్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కేసు



**ప్రజాపక్షం/కామేపల్లి:** నకిలీ విత్తనాలను కొని మోసపోవద్దని కామేపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి బి తారాదేవి అన్నారు. రైతులు విత్తనాలు కొనే ముందు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. విత్తనాలు ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విత్తన వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని కామేపల్లి ఎస్ఐ బి సాయికుమార్ అన్నారు. డీలర్లు తాము అమ్ముతున్న విత్తన షాపుల్లో స్టాక్ బోర్డులు, లైసెన్సులు తప్పని సరిగా ప్రదర్శించాలన్నారు. స్టాక్, బిల్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, విడిగా విత్తనాలు అమ్మకూడదన్నారు. గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలనే విక్రయించాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

## పాఠశాలలు తెరవకముందే పాఠ్యపుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలోని తిమ్మంపేట గ్రామం నందు రాష్ట్ర చరిత్రలో లేని విధంగా పాఠశాలలు తెరవక ముందే కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో మారుమూల ప్రాంతమైన తిమ్మంపేటలో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పాఠశాలలకు చేర్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించ లేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధతో ఇంకా పాఠశాల తెరవడానికి సమయం ఉండగానే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఇంత మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్‌రావు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోయం నాగరాజు, కాంగ్రెస్ యువ నాయకులు కటికనేని ఆదిత్య పాల్గొన్నారు.

## సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శిగా గండు శ్రీను



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** భారత్ కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) బోదులబండ గ్రామ శాఖ కార్యదర్శి గా గండు శ్రీను ఎన్నికయ్యారు. గురువారం మండలంలోని బోదులబండ గ్రామ శాఖ సమావేశం అనంతు పుల్లయ్య అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్టీ కార్యక్రమాలకు గురించి చర్చించారు, తొలుత పార్టీ అరుణ పథకాన్ని కర్నాటి భాను ప్రసాద్ ఆవిష్కరించారు. కొత్త సభ్యులు పార్టీ లోకి ఆహ్వానించారు. అనంతరం నూతన కార్యదర్శి ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శి గా ఎస్.కె యాకుబ్ ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వర రావు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, గ్రామ శాఖ సభ్యులు జానిమియ్య, రామదాసు,నాగ సైదులు, వేంకట నారాయణ,సోహెల్ పాల్గొన్నారు.

## జనరల్ మేనేజర్ సివిల్ కు సన్మానం



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** ఈ నెల అనగా మే, 31న పదవి విరమణ పొందుతున్న జిఎం సివిల్ తిరుకోటి సూర్యనారాయణ పదవి విరమణ పొందుతున్న సందర్భంగా గురువారం ఘనంగా పుష్ప గుచ్ఛంతో శాలువాలతో కొత్తగూడెం ఏరియా అధికారులు జిఎం కార్యాలయంలోని అధికారులందరూ ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జిఎం మాట్లాడుతూ, సూర్యనారాయణ, కంపెనీకి చేసిన సేవను గురించి కొనియాడారు. వారు సింగరేణి సంస్థలో వివిధ హోదాలలో పనిచేశారని వారు చేసిన సేవలు మరువలేనివని అంకితభావంతో పనిచేసి, అందరిమన్నలను పొందారని, వారి శేష జీవితం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమములో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు, ఎస్.ఓ.టు జిఎం జీవి కోటిరెడ్డి, ఏరియా ఇంజెనీర్ కే. సూర్యనారాయణ రాజు, ఎజిఎం సివిల్ సిహెచ్.రామకృష్ణ, ఎజిఎం ఫైనాన్స్ కే.హన సుమలత, డిజిఎం ఐఈ ఎన్.యోహాన్, ఏజెంట్ పద్మావతి ఖని బి.రవీందర్, ఏరియా రక్షణాధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఏరియా స్టోర్ ఇంచార్జ్ లక్ష్మణమూర్తి, ఇంచార్జ్ పర్చేస్ డిపార్ట్మెంట్ బి.మాధవ్, ఇంచార్జ్ క్వాలిటీ మదన్మోహన్, ఎస్.ఓ.ఎం ఎన్విరాన్మెంట్ తోట సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ ఎం.పరశురాములు ఐటీ మేనేజర్ శేషశ్రీ, ఇంచార్జ్ ఆర్‌సిహెచ్‌పి ఎస్.కే.కరిముల్లా, సీనియర్ పిఓ జి.సంఘమిత్ర, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి.తౌర్య, అధికారులు వివి మధుకర్, బి.శంకర్ ఇతర అధికారులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- ఇందిరమ్మ ఇళ్లు,ఇందిరా గిరి జలవికాసం పథకాలు
- ఐటిడిఏల ద్వారా అమలుకు శ్రీకారం
- గిరిజన జీవనతీరు మార్చేందుకు కృషి






**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రభుత్వం గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. గిరిజనులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు, వారి జీవన విధానంలో మార్పులు తెచ్చేందుకు, బ్రతుకుల్లో వెలుగులు నింపేందుకు, బాహ్యప్రపంచంతో పోటీ పడేందుకు ఐటిడిఏల ద్వారా పథకాలు అమలు చేసేందుకు నడుం బిగించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఇందిరా గిరి జలవికాసం ప్రథకం ప్రారంభించిన ప్రభుత్వం పోడుభూమును గిరిజన రైతులు పచ్చగా మార్చుకునేందుకు పూర్తి సబ్సిడితో చేయూతనందిస్తోంది. ఇందులో భాగంగా ఆదివాసీలు, గిరిజనుల అధిగంగా నివసించే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుంది. మరో ప్రక్క తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటిడిఏ పరిధిలోని ఆదివాసీలు, గిరిజనులకు ఆవాసాలు ఏర్పాటు చేసేందుకు మొత్తం 22016 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది.

### ఇందిరమ్మ ఇళ్లు...

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భద్రాచలం, ఉట్నూరు, ఏటూరునాగారం, మన్ననూరు ఐటిడిఏ పరిధిలోని నివశించే ఆదివాసీలు, గిరిజనులు మేలు చేసేందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందే ఇప్పటికే పై నాలుగు ఐటిడిఏ పరిధిలో ఆయా మండలాల ఎంపిడిఓలు సర్వేలు మొదలుపెట్టారు. పదిహేను రోజుల్లో పనులు మొదలుపెట్టి 3 నెలల్లో పూర్తి చేసి అప్పగించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. భద్రాచలం ఐటిడిఏ పరిధిలో 5024, ఉట్నూరు ఐటిడిఏ పరిధిలో 12836, ఏటూరునాగారం ఐటిడిఏ పరిధిలో 2000, మన్ననూరు ఐటిడిఏ పరిధిలో 2156 ఇళ్ల మొత్తంగా కలిపి 22016 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఇందులో ఆదివాసీలకు 13266, గిరిజనులకు 8750 ఇళ్లను కేటాయిస్తారు.

### ఇందిరా జల గిరి వికాసం...

పోడు భూములను పచ్చగా మార్చుకునేందుకు ఐటిడిఏ ద్వారా పూర్తి సబ్సిడితో ఇందిరా గిరి జన వికాసం పథకాన్ని సైతం ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పథకాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా గిరిజన రైతులకు సోలార్ విద్యుత్ ద్వారా పంపుసెట్లు అందించేందుకు నిర్ణయించింది. 202526 నుండి 202930 వరకు రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల ఎకరాలు సాగులోనికి తీసుకు వచ్చేందుకు నిర్ణయించగా, భద్రాచలం ఐటిడిఏ పరిధిలోని గిరిజన రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రానున్న ఐదేళ్లపాటు ఈ పథకం ద్వారా 1.96 లక్షల ఎకరాలు సాగులోనికి తెచ్చేందుకు అత్యధిక నిధులు కేటాయించారు. కాగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా తొలూత చంద్రుగొండ మండలంలోని పలు గ్రామాలు ఎంపిక చేశారు. ఈ నెల 30 నాటికి సర్వేపూర్తి చేసి జూన్ 25 నాటికి ఎంపిక చేసిన ప్రాంతాల్లో పనులు ప్రారంభిస్తారు. తొలి ఏడాది జిల్లాలో 2912 రైతులకు మేలు చూకూర్చేలా 8046 ఎకరాలకు పథకం అమలు చేస్తారు. రెండో సం.14856 రైతులకు గానూ 46988 ఎకరాలు, 3వ సం. 14856 రైతులకు గానూ 46988 ఎకరాలు, 4వ సం.14856 మంది రైతులకు గానూ 46988 ఎకరాలు, చివరి 5వ సం.14856 రైతులకు గానూ 46988 ఎకరాల్లో మొత్తంగా 62347 మంది రైతులకు గానూ 1లక్ష96 వేల పోడు ఎకరాల్లో ఈ పథకం అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఐటిడిఏల ద్వారా గిరిజనులకు మేలు చేకూరే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో గిరిజనుల్లో హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి.

# నయా జోష్‌కు నాంది పలికిన సిపిఐ నాయకత్వం

-యువకులకు బాధ్యతలు
- 28,29,30 డివిజన్లలో నూతనంగా కమిటీలు ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్ సిపిలో నయా జోష్‌కు నాయకత్వం నాంది పలికింది. తాజాగా బుధవారం నిర్వహించిన శాఖ సమావేశం సాక్షిగా కొత్త ఒరవడిని తీసుకొచ్చింది. ఇంత కాలం శాఖగా ప్రజల పక్షాన అండగా నిలుస్తూ ఇప్పుడు 28,29,30 డివిజన్లుగా ఏర్పాటయ్యింది. ఇందులో భాగంగా నియామకమైన సిపిఐ, ఏఐవైఎఫ్, మహిళా సమాఖ్య నూతన కమిటీలు వేసి యువరక్తానికి బాధ్యతలు అప్పగించారు. సిపిఐ నుంచి 28వ డివిజన్ కార్యదర్శిగా లగిశెట్టి రమేష్, సహాయకార్యదర్శులుగా శాబాద్ సైదిరెడ్డి, నారపొంగు యాకుబ్, రంగారావు, 29వ డివిజన్ కార్యదర్శిగా వెంపటి రాము, సహాయకార్యదర్శులుగా అక్కినపల్లి కరుణాచారి, బుద్ధి నాగేశ్వరరావు, బుద్ధి రాధాకృష్ణ, కోటా శ్రీనివాస్‌రెడ్డి, 30వ డివిజన్ కార్యదర్శిగా బియ్యాల రాజు, సహాయకార్యదర్శులుగా పానమాకుల కృపాకర్, సారగుండ్ల రమేష్, సురబ్‌సాయి. బానోత్ బిక్షంతో పాటు సభ్యులను ఎనుకున్నారు. అలాగే ఏఐవైఎఫ్ 28వ డివిజన్ అధ్యక్షుడిగా రెబ్బగొండ్ల గోపి, కార్యదర్శిగా అక్కినపల్లి దేవయ్య, 29వ అధ్యక్షుడిగా రామిశెట్టి సంజయ్, కార్యదర్శిగా మిరియాల నరుణ్‌తేజ్, 30వ అధ్యక్షుడిగా దైథా జెమ్స్, కార్యదర్శిగా బంకా అశోక్‌తో పాటు సహాయ కార్యదరుశలు, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ప్రస్తుతానికి 28,29,30వ డివిజన్లకు మహిళా సమాఖ్య కమిటీ సభ్యులను మాత్రమే ఎన్నుకున్నారు. ఇందులో సిపిఐ పార్టీ డివిజన్‌లైన 28,30కు వెంపటి సురేందర్, 29 డివిజన్‌కు దండి రంగారావును ఇన్చార్జిగా ఏర్పాటు చేశారు.

# సెక్యూరిటీ గార్డుల సేవలు అభినందనీయం

-కొత్త కాంట్రాక్టు ప్రారంభం
-మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి సంస్థ పరిరక్షణలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సేవలు ఎంతో అభినందనీయమని 365 రోజులు సంస్థ ఆస్తులను కాపాడటంలో, భద్రతను కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌ఏఐటియుసి నాయకులు అన్నారు. గురువారం కొత్తగూడెం కార్పోరేట్ లో కొత్త కాంట్రాక్టు A1 రాయల్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రారంభం సందర్భంగా సంస్థ ఎండి మహారాజ్ ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య ఉపాధ్యక్షులు, కెడబ్ల్యూ కిష్టోఫర్ లు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా విధులను నిర్వహిస్తూ సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. నేడు సింగరేణిలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు సింగరేణి కి సంబందించిన భద్రత, రక్షణతో పాటు ప్రభుత్వానికి సంబంధించిన అనేక సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవడం అభినందనీయమని అన్నారు. రాత్రివేళలో అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నప్పటికీ వాటిని సైతం లెక్కచేయకుండా విధులను నిర్వహించటం గర్వకారణం అన్నా రు. భవిష్యత్తులో వీరి సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ నజీర్,పి. శాంతమూర్తి,ఈశ్వర్, జమేదార్ హనుమంతరావు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కెజి సిరపురం పారిశుద్ధ్యంపై పట్టింపు ఏది..?

-సిరిపురంలో అధికారుల నిర్లక్ష్యం పారిశుద్ధ్యానికి శాపం
-ప్రభుత్వ ఆదేశాలు అమలు ఎక్కడ?







**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామాల్లో ఎక్కడ పారిశుద్ధ్య సమస్యలు ఉండవద్దని చెప్పిన విషయాలను అధికారులు మరిచిపోతున్నారు. వైరా మండలం కెజి సిరిపురం గ్రామంలో పారిశుద్ధ్యంపై పట్టింపు లేదు. అసలు పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. ఇలా వదిలేస్తే ప్రజలకు ఇబ్బందులు తలెత్తవా, రోగాలు రావా, ఎందుకు అంత నిర్లక్ష్య ధోరణితో ఉన్నారు. ప్రత్యేక పాలనలో పారిశుద్ధ్యం పనులను పూర్తిగా ప్రక్కన పెట్టేస్తారు అనే వాదన కూడా బలంగా వినిపిస్తుంది. ఎందుకంటే ఎవరు పట్టించుకునే పరిస్థితి లేదు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత కూడా అధికారులు మరిచిపోయారు. సిరిపురం గ్రామంలో రాజన్న కాలనీ పరిస్థితి అస్తవ్యస్థంగా ఉంది. సాయంత్రంపూట చీకటిపడితే రోడ్లను కమ్మేసిన పిచ్చి చెట్లతో ఎలాంటి విష పురుగులు వస్తాయే అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్లకు కనీసం డ్రైనేజీలు కూడా కనిపించకుండా చెత్త కమ్మేసింది. అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఒక్కసారి ఆలోచించాలి. అసలు గ్రామపంచాయతీ సెక్రటరీకు పారిశుద్ధ్యంపై ఎందుకు పట్టింపు లేకుండా పోతుంది. ప్రభుత్వం పారిశుద్ధ్య లోపం రావద్దు అని చెబుతుంటే దానికి భిన్నంగా ఇక్కడ పారిశుద్ధ్య పనులు కనిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ సారు సిరిపురం గ్రామంలో పారిశుద్ధ్యం పనులపై ఒక్కసారి దృష్టి సారిస్తే సామాన్య ప్రజలకు పడుతున్న ఇబ్బందులు తెలుస్తాయి. ప్రస్తుతం ఆ గ్రామంలో ఎవరు పట్టించుకునే పరిస్థితి అక్కడ కనిపించడంల ఏదు. చేతిపంపులో నీరు తెచ్చుకోవాలంటే ముళ్ళ కంపలు దాటాల్సిందే. ప్రత్యేక అధికారుల పాలన వచ్చిన తర్వాత పారిశుద్ధ్యాన్ని పూర్తిగా పట్టించుకోకుండా ఆఫీస్‌కు వచ్చామా అటెండెన్స్ వేసామా పోయామా అనే విధంగా అధికారులు పనితీరు కొనసాగుతుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని సిరిపురం గ్రామంలోని పారిశుద్ధ్యం పట్ల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పరిశీలన




**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఏరియా ఎస్ఓ టు జిఎం డి శ్యామ్ సుందర్ సంబంధిత అధికారులతో కలిసి పివి కాలనీ భద్రాద్రి స్టేడియంలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఓ టు జిఎం డి. శ్యామ్ సుందర్ భద్రాద్రి స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లు చేస్తున్న ఆయా విభాగాల అధికారులతో మాట్లాడుతూ జూన్ 2వ తేదీన జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు భారీ యెత్తున సింగరేణియులు వారి కుటుంబ సభ్యులు, స్థానిక పురజనులు అధిక సంఖ్యలో రావటం ఆనవాయితీగా కొనసాగుతుంది కాబట్టి వారికి ఎలాంటి అసౌకర్యం, ఇబ్బంది కలుగకుండా తగినన్ని కుర్చీలు వెయ్యడం, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయడం ప్రాధాన వేదికను కళాత్మకంగా సుందరికరించడం, గ్రౌండ్ మొదలు సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయడంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా జాగ్రత్త పడటం పాటు అధిక సంఖ్యలో విచ్చేసే మహిళల రక్షణ నిమిత్తం సరిపడ సెక్యూరిటీని ఏర్పాట్లు చేయడంతో పాటు వేడుకలు ఆసాంతం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఇతర ప్రాంతాల నుండి వచ్చే కళాకారులు, స్థానిక సింగరేణి ఉద్యోగ కళాకారులు అందరినీ అలరించేలా చక్కని సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాట్లు చేయడమైనది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే వివిధ రకాల స్టాల్స్ పెట్టుకునే వ్యాపారస్తులు రుచి సూచికరమైన పదార్థాలు అందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించేలా నిబంధనలు విధించాలని అధికారులకు సూచించారు. సింగరేణియులు వారి కుటుంబ సభ్యులు ఈ వేడుకలలో అధిక సంఖ్యలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో డిజిఎం (పర్సనల్) ఎస్. రమేశ్, ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారులు సింగు శ్రీనివాస్, వి. రామేశ్వర రావు, డివై.ఎస్ఈ (సివిల్) ప్రవీణ్ కుమార్, సర్వే అధికారి సర్వర్ నబీ, స్పోర్ట్స్ సుపర్వైజర్ జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

# మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలుకుదాం..



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకుని తన పుట్టిన గడ్డైన వరంగల్‌కు తిరిగివస్తున్నందున ఘన స్వాగతం పలుకుదాం అని మాదిగ ఎంఎస్‌పీ జాతీయ నాయకులు వంగూరి ఆనంద్‌రావు పిలుపునిచ్చారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వెంకటగిరిలో గ్రామ సభను సంఘను ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా ఒంటిపై వేసుకున్న నల్లజెండాను మార్చకుండా సాధించిన మహానేత అన్నారు. ఈ క్రమంలో అన్ని కులలోని సమస్యలను ప్రస్తావించి పోరాటాలు చేశారన్నారు. మాదిగ, ఉపకులాల ఏండ్ల నీరిక్షణకు తెరదింపిన కృష్ణకు కృతజ్ఞతలు తెలిపేందుకు మే31వ తేదీన వరంగల్ రైల్వే స్టేషన్‌కు ఉదయం 10గంట లోపు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కందుకూరి వెంకటనారాయణమాదిగ, దగ్గుపాటి వెంకయ్యమాదిగ, దగ్గుపాటి మల్లయ్యమాదిగ, దగ్గుపాటి రాముమాదిగ, దగ్గుపాటి వైకుంఠంమాదిగ, వెంకటరవిమాదిగ, రాంబాబుమాదిగ, సహదేవ్‌మాదిగ, గణేష్‌మాదిగ, శ్రీనుమాదిగ, ప్రవీణ్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేయటమే ధ్యేయం




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేయడమే జమాతే ఇస్లామీ హింద్ సమ్మర్ క్యాంప్ ధ్యేయమని జమాతే ఇస్లామిక్ హింద్ సారపాక పట్టణ అధ్యక్షులు జహీర్ పాషా అన్నారు. గురువారం జమాతే ఇస్లామిక్ హింద్ సారపాక పట్టణ శాఖ ఆధ్వర్యంలో మే 25 నుండి మే 29 తూదీ వరకు 5 రోజులు పాటు సాజిదా మజీద్‌లో ఇస్లామిక్ సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు ఈ కార్యక్రమంలో ఖురాన్ పఠనం, ప్రవక్త జీవిత విశేషాలు, వ్యక్తిత్వ వికాసం, క్విజ్లతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఐదు రోజులు పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా జమాతే ఇస్లామిక్ హింద్ సారపాక పట్టణ అధ్యక్షులు జహీర్ పాషా, జమాతే ఇస్లామిక్ హింద్ సభ్యులు షేక్ నాగూర్ వలి, షేక్ అబ్దుల్ సలీంలు పాల్గొని మాట్లాడారు. నైతిక విలువలు వ్యక్తి వికాసానికి బాటలు వేయటమే జమాతే ఇస్లామిక్ హిందూ ముఖ్య ఉద్దేశమని అన్నారు. అనంతరం ఈ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన విద్యార్థి, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో జమాతే ఏ ఇస్లామీ సభ్యులు, పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు పర్మనెంట్ చేయాలి




**ప్రజాపక్షం/కారేపల్లి:** మాదారం స్టీల్ ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పర్మినెంట్ చేయాలని టియూసిఐ జిల్లా కార్యదర్శి జి రామయ్య అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులతో పాటు పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన స్టీల్ ప్లాంట్ యాజమాన్యం శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. మాదారం స్టీల్ ప్లాంట్‌లో ప్రతి సంవత్సరం నష్టాల పేరిట కాంటాక్ట్ కార్మికులను తొలగించాలనే ఉద్దేశంలో స్టీల్ ప్లాంట్ యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో గత 15 రోజుల నుండి కాంట్రాక్ట్ కార్మికులను తొలగించవద్దని నిరవధిక సమ్మె చేస్తుంటే కనీసం యాజమాన్యం చర్చించకుండా అక్రమంగా అరెస్టు చేయడం కోసం ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య వారన్నారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కాంట్రాక్ట్ కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా గ్రామ పంచాయితీ మధ్యాహ్న భోజనం ఆశ అంగన్వాడీ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టియుసిఐ కారేపల్లి ఏరియా కార్యదర్శి ధరావత్ సక్రు, ఎస్కే కైరుద్దీన్, వీరు, ఇబ్రహీం, హుస్సేన్, రవి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## బీటీపీఎస్‌లో విద్యుత్ జేఏసీ ధర్నా




**ప్రజాపక్షం/మణుగూరు:** ఉత్తరప్రదేశ్‌లోని విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించాలానే ప్రయత్నాని నిరసిస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో బీటీపీఎస్ లో గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించాడని నిరసిస్తూ పలు నినాదాలతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెలంగాణ పవర్ ఇంజనీర్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి బి. రవి ప్రసాద్ ప్రసంగించారు. విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులందరు ఐక్య ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ లో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా డిస్కములను ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తుందనే ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆ రాష్ట్ర విద్యుత్ నాయకులపై అప్రజాస్వామికంగా కేసులు పెడుతూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఉద్యోగులందరు ఉత్తరప్రదేశ్ ఉద్యోగులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ స్టేట్ పవర్ అసిస్టెంట్ ఇంజనీర్ల అసోసియేషన్ రీజినల్ సెక్రెటరీ రవితేజ, బీసీ అసోసియేషన్ నాయకులు సాయిరాం, కార్మిక సంఘం 1535 రీజనల్ అధ్యక్షులు వి. ప్రసాద్, కార్మిక సంఘం 327 అధ్యక్షులు బి.కృష్ణ, కార్మిక సంఘం 1104 నాయకులు వెంకట్రాం, సిఐటియు నాయకులు వీరస్వామి కార్మిక సంఘం నాయకులు ఆర్. రామచందర్, సిద్దెలో హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్న పిల్లల మలి ఒడి అంగన్వాడీ

**- మంత్రి దనసరి అనసూయ సీతక్క**
**- ఇందిరమ్మ అమృత పథకం ప్రారంభోత్సవం**







**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పిల్లలకు అమ్మ ఒడి మొదటిది కాగా, రెండో ఒడి అంగాన్వాడీ అని, పిల్లల ఆలనాపాలనా తల్లిదండ్రుల తర్వాత అంగన్వాడీలే చూస్తారని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ,శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కౌమార బాలికల్లో ఉన్న రక్తహీనతను తొలగించేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ అమృతం పథకాన్ని గురువారం కొత్తగూడెం క్లబ్‌లో ఎంపి పోరిక బలరామ్ నాయక్, భద్రాచలం, ఇల్లందు, పినపాక,అశ్వారావుపేట ఎంఎల్‌ఏలు డా.తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, మహిళా శిశు సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితరామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఐటిడిఏ పిఓ రాహుల్‌తో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా పథకం గోడపత్రికను ఆవిష్కరించిన అనంతరం ఇందిరమ్మ అమృతం పథకం కౌమార బాలికలకు ఇచ్చే పల్లీ, చిరుధాన్యాలతో తయారుచేసిన పట్టీ ప్యాకెట్లను ప్రారంభించారు. ముందుగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ ఆడపిల్లలకు శక్తినిద్దాం ఆరోగ్యవంతమైన తెలంగాణాను నిర్మిద్దామనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పాలెట్ ప్రాజెక్టులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం, కొమరంభీమ్ ఆసీఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో దీనిని అమలు చేయనున్నట్లు తెలిపారు. మూడు జిల్లాల వ్యాప్తంగా 50269 మంది 14 18 సం. ఉన్న కౌమార బాలికలకు ఈ పథకం ద్వారా లబ్ది చేకూరనుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆడ పిల్లలకు సరైన పౌష్టికాహారం లేక అనేక రకాల వ్యాధుల భారిన పడుతున్నారని, ఈ సమస్యను అధిగమించేందుకే ఈ పథకం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. పల్లీలు, చిరుధాన్యాలతో కూడిన పట్టీలను నెలకు రెండు సార్లు అంగన్వాడీల ద్వారా అందిస్తారని, వీటిని తినడం ద్వారా రక్తం వృద్ధి చెందడంతో పాటు నెలసరి సమయంలో వచ్చే ఇబ్బందుల నుండి బయటపడటమే కాక మరింత ఆరోగ్యవంతంగా తయారవుతారని చెప్పారు. ఆరోగ్యవంతమైన ఆడపిల్లలు ఉన్న సమాజం మిరంత ఆరోగ్యంగా ఉంటుందని, అందుకే వారిని ఎదగనివ్వాలని, బ్రతకనివ్వాలని, గౌరివించాలని, ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ కేంద్రాలన్నింటినీ ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా మార్చడం జరిగిందని, నర్సరీ పాఠాలతో పాటు ఆహారం అందిస్తారన్నారు. ప్రైవేటు బడులకు పంపించి తల్లిదండ్రులు డబ్బులు వృధా చేయకుండా అంగన్వాడీ కేంద్రాలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తయారు చేస్తున్నామని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకరూప దుస్తులు అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు ఆడుకునేందుకు 57 రకాల ఆటవస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చిన గర్భిణీలు క్రింద కూర్చోకుండా బల్లలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పిల్లలు ఇష్టంగా తీనేందుకు గానూ బాలమృతం తయారీలో కొంత మార్పులు చేసి అందిస్తామని, పిల్లలను ఆకర్షించే విధంగా కేంద్రాల్లో బొమ్మలు, పెయింటింగ్స్ వంటివాటితో బోధన చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో మహిళా శిశు సంక్షేమశాఖ వారు తయాలు చేసిన వేస్ట్ నుండి బెస్ట్ చాలా ఆకర్షిణీయంగా ఉందని, వాటిని రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించేలా చూస్తామన్నారు. తొలిసారిగా అంగన్వాడీ కేంద్రాలకు నెలరోజుల పాటు వేసవి సెలువులను ప్రభుత్వం ప్రకటించిందని, అంగన్వాడీ టీచర్లు ఎప్పటి నుండో ఎదురు చూస్తున్న రిటైర్డెమెంట్ బెనిఫింట్స్ రూ.2 లక్షలు అందించేందుకు బుధవారం సాయంత్రమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఫైల్‌పై సంతకం చేశారని తెలిపారు. చిన్న చిరు ఉద్యోగుల కష్టాలు తీర్చి కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యమని, రాబోయే రోజుల్లో ఆశావర్కర్లకు సైతం జీతాలు పెంచడంతో పాటు క్రమబద్దీకరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందించే పథకాలు క్షేత్రస్థాయిలో అందరికీ అందేలా ఉద్యోగులు సహకరించాలని, విద్యార్థుల అభివృద్ధికి అమ్మ,నాన్నతో పాటు ఉపాధ్యాయులు పాత్ర కీలకం అన్నారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా తల్లిదండ్రులు లేని పిల్లలకు నెలకు రూ.4 వేలు అందిజేస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు లేని పిల్లలు బాధపడవద్దని, ఇంత పెద్ద ప్రభుత్వం మీకు అండగా ఉందన్నారు. ఈ పథకం క్రింద జిల్లాకు మంజూరైన రూ.74 లక్షల 64వేల చెక్కును పిల్లలకు మంత్రి తన చేతుల మీదుగా అందజేశారు. అంగన్వాడీ టీచర్లకు పదవీవిరమణ లాభాలు రూ.2 లక్షలు ఆమోదానికి కృషి చేసిన మంత్రి సీతక్కను మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు, అంగన్వాడీ టీచర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ నాగలక్ష్మి , సిపిఓ సంజీవరావు, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనిన, జిల్లా అధికారులు, అంగన్వాడీ టీచర్లు, మహిళ శిశు సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత ప్రమాణాలు పెంచి వినియోగదారులను నిలుపుకోవాలి

**-నూతన గనులను సాధించుకోవడానికి కృషి చేయాలి.**
**-పని సంస్కృతిలో మార్పునకు కార్మిక సంఘాల సహకారం తీసుకోవలి**




**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** రానున్న రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వ బొగ్గు సంస్థలు డిమాండ్కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తపరిచేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నడుం కట్టింది. ఇందులో భాగంగా కోలిండియా సహా సింగరేణిపై కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై కీలక దిశా నిర్దేశం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీ నుంచి జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి తరఫున సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి ఈ సమీక్షలో పాల్గొన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలపై కూలంకశంగా వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతి మెరుగుపరచాలని సూచించారు. అలాగే ఉత్పత్తి ఖర్చు తగ్గింపునకు సింగరేణి అధికారులు బొగ్గు మంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతుందని, కమిటీ చేసే ఆచరణాత్మక సూచనలను వెంటనే అమలు జరిపి ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని సూచించారు. వినియోగదారులు సింగరేణి సంస్థకు దూరం కాకుండా ఉండాలంటే నాణ్యతపై కూడా గట్టి దృష్టి పెట్టాలన్నారు. బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ మాట్లాడుతూ, బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, అలాగే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు ధర అందుబాటులోకి తీసుకురావొచ్చని, దీంతో అంతిమంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా తగ్గి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఆయన కోల్ ఇండియా గనులతో పాటు సింగరేణి గనుల పనితీరును, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. ఈ కార్యక్రమం లో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు ఈఅండ్ఎం, ఎల్వీ సూర్యనారాయణ రావు, ఆపరేషన్స్, కె.వేంకటేశ్వర్లు పిఅండ్‌పి, పా, ఈడీ ఎస్డీఎం.సుభాని తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్మికుల సమస్యలపై వినతి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** గురువారం కొత్తగూడెం లో పలు అభివృద్ధి కార్యక్రమల శంకుస్థాపన ల కు వచ్చిన మంత్రి అనంతరం, కొత్తగూడెం క్లబ్ లో శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ను కలిసి వినతిపత్రం అందజేసిన ఏఐటియుసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి బృందం, కంచర్ల జమలయ్య సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చి అంగనవాడి సమస్యలను మంత్రి కి తెలియజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి మిగతా సమస్యలు కూడా ముఖ్యమంత్రిగా దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యల తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు గోనె మణి, ప్రమీల, రజిత, సుశీల, సరోజ,రమాదేవి, జానకి, జమున,

## ప్రభుత్వ పాఠశాల్లోనే మెరుగైన విద్య

**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం:** ప్రభుత్వం పాఠశాలలో నాన్యమైన విద్య అందుతోందని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాలను కాపాడుకోవాల్సిన బాద్యత ప్రతి తల్లి దండ్రులపై ఉందని టియస్ యుటియఫ్ రాష్ట కార్యదర్శి బి రాజు అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థుల నమోదుకై జీపు జాత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుమ్ముగూడెం, నర్సాపురం రేగుబల్లి, బండిరేవు, పర్ణశాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాలగా అర్హత కల్గిన ఉపాధ్యాయని ఉపాధ్యాయులు ఉన్నారని ప్రైవేటు పాఠశాలలకు దీటుగ విద్యబోదన జరుగుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు సకల సదుపాయాలను కల్పిస్తుందని అందులో బాగంగా ప్రతి విద్యార్థికి ఏక రూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు, హాస్టలు పిల్లలు మరెన్నో వసతి సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. పిల్లలను ప్రైవేటు పాఠశాలలు చేర్పించి తల్లి దండ్రులు ఆర్థికంగా నష్టపోతున్నారని గుర్తు చేసారు. ఈకార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్నదాత... సాగుబాట..

**ప్రజాపక్షం/కల్లూరు:** ఋతుపవనాల ప్రభావంతో వర్షాలు పడుతుండటంతో అన్నదాతలు సాగుబాట పట్టారు. ప్రత్యేకంగా వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించి దుక్కులు దుండటం, వరి విత్తనాలు చల్లడం, ఎరువులు తోలి పొలాలు చదును చేసుకుని చెత్తను తగలబెట్టి పంటలను సాగు చేసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు జిలుగులు చల్లడం, వరి విత్తనాలు చల్లడం మరికొందరు వరి, పత్తి, మొక్కజొన్న తదితర విత్తనాలు కొనుగోలు చేయడం ఖరీఫ్ కు పంట పెట్టుబడి సిద్ధం చేసుకుంటున్నారు. మండల పరిధిలోని 44 వేల ఎకరాలలో ఈ 22,000 మంది రైతులు మెట్ట మాగాణి పంటలను సాగుకు సిద్ధమయ్యారు. మండల పరిధిలోని వాచ్యనాయక తండా, లింగాల, బత్తులపల్లి, ముచ్చవరం, పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, వెన్నవల్లి, చెన్నూరు, కల్లూరు, పుల్లయ్య బంజర, ఎర్ర బోయినపల్లి తదితర గ్రామాలలో సాగుకు అన్నదాత సిద్ధమయ్యారు.

## జాతీయ రహదారులే మా అడ్డ

**-పశువులతో పొంచి ఉన్న ప్రమాదం**

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల కేంద్రంలో జాతీయ రహదారిపై రహదారి అడ్డాగా సంచరిస్తుండడంతో రాత్రి పగలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు తెలుపుతున్నారు. నాలుగు లైన్ల రోడ్డు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ లేకపోవటంతో తెలుపు నలుపు పశువులు రోడ్డుపై సంచరిస్తూ సేదతీరుతూ ఉండటంతో వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కనపడకపోవడంతో వాహనదారులు ప్రమాదానికి గురై ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు తెలుపుతున్నారు. కల్లూరులోని హిమాలయ రెస్టారెంట్ నుండి ఎన్ఎస్పి క్రాస్ రోడ్డు వరకు ఇదే విధంగా రోడ్డుపై తెలుపు నలుపు పశువులు సంచరిస్తున్నాయి. తెలుపు, నలుపు పశువుల వలన ప్రమాదానికి గురై ఇబ్బందులు పడుతున్నట్లు ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోని వీటిని కట్టడి చేయాలనిప్రయాణికులువాహనదారులుసంబంధిత శాఖఅధికారులను కోరుతున్నారు.

## నెరవేరిన పేదోడి సొంతింటి కల

**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఇళ్ల లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లు కలగా ఉన్న సొంతింటి నిర్మాణం సాధ్యమైంది అంటే అది ఇందిరా ప్రజా ప్రభుత్వం, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వల్లే అని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ రాంబాబు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దొడ్డ నరేష్, కర్లపూడి బాలు, బొంతు రాజశేఖర్, నక్కా తనుజ్, బాల రామారావు, దొడ్డ భాస్కర రావు, అనంతుల చందర్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

**ప్రజాపక్షం/దమ్మపేట:** ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ శిక్షణ తరగతులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసానిలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సామజిక వర్గానికి చెందిన మంత్రి ధనసరి సీతక్క (అనసూయ) ఆదివాసీ శాసనసభ్యులు గిరిజన ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ తరగతుల్లో అశ్వారావుపేట శాసనసభ్యులు, గిరిజన నాయకుడు జారె ఆదినారాయణ ఆదివాసీ సమాజాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదివాసీల పట్ల ఆయనకున్న గౌరవం, అభిమానం ఆయన మాటల్లో తేటతెల్లమైంది. ఆదివాసీ హక్కులు వారి అభివృద్ధి ప్రభుత్వం అందిస్తున్న పథకాల సద్వినియోగంపై ఆయన స్పష్టంగా మాట్లాడారు. ప్రజలలో అవగాహన పెరిగేలా నూతన ఆత్మవిశ్వాసం కలిగేలా ఆయన ప్రసంగం సాగింది. జారె ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ఆదివాసీ సమాజం అభివృద్ధి చెందాలంటే విద్య, ఆరోగ్యం, భూమిహక్కులు, ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలను ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా అందిపుచ్చుకోవాలన్నారు.

# మధిర నియోజకవర్గాన్ని తెలంగాణకు ఆదర్శంగా తీర్చిదిద్దుతా



**- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన డిప్యూటీ సీఎం భట్టి**



**ప్రజాపక్షం/ బోనకల్ :** మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ తెలంగాణకు ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. గురువారం బోనకల్ మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. బోనకల్ మండలంలోని చిన్నబీరవల్లి, గార్లపాడు, బోనకల్ గ్రామాల్లో రూ.9.49కోట్లతో బిటి రోడ్డు మరమ్మతులు, బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బోనకల్ మండలం గార్లపాడు గ్రామం నుంచి వయా రామపురం మీదుగా నాగలువంచ గ్రామం వరకు రూ.2.23కోట్ల బిటి రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. ఆతర్వాత బోనకల్ మండలం చిన్నబీవరల్లి గ్రామం నుంచి నారాయణపురం గ్రామం వరకు రూ.4.50కోట్లతో బిటి రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బోనకల్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ డైరీ నుంచి రావినూతల గ్రామం వరకు రూ.2.76కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్ల నిర్మాణానికి సంబంధించిన అంశాలను అధికారులతో చర్చించి మ్యాప్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ మధిర నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా బోనకల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయటం జరిగిందని తెలిపారు. మునుముందు కూడా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముందుగా ఉపముఖ్యమంత్రి భట్టికి మహిళలు మంగళహారుతలతో ఘన స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,అధికారులుపాల్గొన్నారు.

# వ్యాక్సిన్లపై అపోహలు తొలగించాలి

**డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బి. కళావతిబాయి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వ్యాక్సిన్లపై ఉన్న అపోహలను తొలగించి వాటి ఉపయోగాల గురించి తల్లిదండ్రులకు వివరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతిబాయి తెలిపారు. వ్యాక్సిన్ల వల్ల ఎనిమిది రకాలైన ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి పిల్లలను రక్షించవచ్చునని తెలిపాలన్నారు. గురువారం భక్తరామదాసు కళాక్షేత్రంలో మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలకు రోటో వైరస్, ఇతర వ్యాక్సిన్లపై రీ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళావతి బాయి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 97 శాతం వ్యాక్సిన్లను గుర్తించిన చిన్నారులకు అందించామని వాటిని 100 శాతం పూర్తి చేయాలన్నారు. వ్యాక్సిన్ల గురించి ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు పిల్లల తల్లిదండ్రులకు వివరించాలని వ్యాక్సిన్ల వల్ల ఎనిమిది రకాలైన ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించవచ్చునని తెలపాలన్నారు. వ్యాక్సిన్ వేసిన రోజున కొందరి పిల్లలకు అబ్సెస్ అవుతుందని కొద్దిగా జ్వరం కూడా వస్తుందని అలాంటప్పుడు భయపడవద్దని తగు జాగ్రత్తలు చెప్పాలన్నారు. చల్లటి నీటిలో ముంచిన గుడ్డను అబ్సెస్ అయిన వద్ద అద్దాలని పారాసెటమాల్ సిరప్‌ను దగ్గర ఉంచుకోవాలని ఆమె తెలిపారు. వ్యాక్సిన్ల పట్ల ఇంకా కొందరిలో అపోహలు ఉన్నాయని వాటిని దూరం చేయాలన్నారు. డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది ఇమ్యూనైజేషన్ షెడ్యూల్ పట్టికను జాగ్రత్తగా గుర్తుపెట్టుకోవాలన్నారు. వ్యాక్సిన్స్, డోసుల గురించి పూర్తి వివరాలు తెలిసి ఉండాలన్నారు. చిన్నపిల్లలకు మాతా శిశు సంరక్షణ కార్డులో వివరాలు నమోదు చేయాలని వ్యాక్సిన్ డ్యూడేట్‌ను కూడా తప్పక రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చందునాయక్, డబ్ల్యూహెచ్‌వో రాష్ట్ర శిక్షకులు డాక్టర్ మురహరి రోటో వైరస్ వ్యాక్సిన్ గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రామారావు, డెమో సుబ్రహ్మణ్యం, డిపిహెచ్ఎన్‌వో శేషురత్నం, డివిఎల్ఎం రమణ, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ కుదింపు ఎవరి కోసం...?



**-60 నుంచి 26 అడుగులకు కుదింపు..**

**-రోడ్డు వెడల్పు కోసం గతంలో అఖిలపక్షం ఆందోళన**



(ఫైల్)



(ఫైల్)

**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా పర్యాటక కేంద్రాల్లో వైరా రిజర్వాయర్ అంటే ప్రతిఒక్కరికి ఎంతో ఆహ్లాదకరంగా ఉండే వాతావరణమని పెద్ద ఎత్తున వైరా పర్యాటక కేంద్రానికి వస్తూ ఉంటారు. అలాంటి పర్యాటక కేంద్రానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణంలో వెడల్పు తగ్గిస్తే అప్పట్లో తెలుగుదేశం , సిపిఐ, సిపిఐ ఎంఎల్, కాంగ్రేస్ పార్టీలు పెద్ద ఎత్తున అఖిలపక్షం పేరుతో ఆందోళన చేసి రాస్తారోకోలు కూడా చేశారు. దాంతో ఆగకుండా అప్పటి కలెక్టర్ పి.గౌతమ్‌ని కూడా కలిసి నివేదిక అందించారు. తర్వాత కలెక్టర్ తహశీల్దార్‌ను ఆదేశించి అప్పటి కమీసనర్ పితాని వెంకటేశ్వర్లు రోడ్డు వెడల్పుపై వివరణ కావాలని అడగడం జరిగింది. దాంతో రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల నేపద్యంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు మరల ఆ రోడ్డు విషయంలో పాత తంతే ప్రారంభమైందని చెప్పవచ్చు. ఎందుకంటే 60 అడుగుల రోడ్డును 26 అడుగులుగా కుదించారు. ఎవరి కోసం కుదించారు. భావితరాలకు ఇచ్చే భరోసా ఇదేనా పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన వైరా రిజర్వాయర్‌కి వెళ్లే దారి ఇంత చిన్నగా చేస్తారా అనేది ఇప్పుడు ప్రతిఒక్కరి ప్రశ్న. కోటి రూపాయల నిధులతో 280 మీటర్ల పొడవున రోడ్డు నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. అయితే ఇక్కడ ఏం జరిగిందో కాఇ గతంలో ఉన్న ప్రొసీజర్ పూర్తిగా మార్చేశారు. ఇదే రోడ్డు నిర్మాణం కోసం అఖిలపక్షంలో కాంగ్రేస్ నేతలు కూడా పోరాటం చేశారు. రోడ్డు 13 అడుగులు, 13 అడుగులు వెడల్పు పెట్టి మధ్యలో ఒకటిన్నర అడుగు డివెండర్ ఏర్పాట్లకు ముగ్గులు పోశారు. ఇది పర్యాటక కేంద్రానికి ఎంతో ముఖ్యమైన రోడ్డు ఈ రోడ్డుపై నిర్లక్ష్యం చేయడం తగ్గదు అని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఈ రోడ్డు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురైందని ఆరోపణలు లేకపోలేదు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 60 అడుగుల రోడ్డు నిర్మాణం చేపడితే వైరా టూరిజంకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రోడ్లు ప్రశాంతంగా దేవేంబర్ లైట్లతో కనిపిస్తాయి. ఇప్పికైనా అధికారులు ఒకసారి దీనిపై ఆలోచించుకొని నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు పట్టాల పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని కొండాపురానికి చెందిన 29మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టాలను గురువారం పంపిణీ చేశారు. తొలుత పట్టాలను అందకున్న మహిళ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి క్షిరాభిషేకం చేశారు. అలాగే మహిళలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు దండ్యాల వెంకటేశ్వర్లు, నాగండ్ల శ్రీనివాస్ స్వీట్స్ తినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఉదర మహేష్, కొర్ని వెంకట్‌నారాయణ, ఉదర భాస్కర్, దొంతగాని సత్యం, దాసరి వీరభద్రం, జమ్మి వీరబాబు, గండి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** మహిళలు ఆరోగ్యంపై సంపూర్ణంగా అవగాహన కలిగి ఉండి శ్రద్ధ చూపాలని ఎఫర్ట్ సంస్థ ఆర్గనైజర్ కరుణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రామపురం గ్రామంలో ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో మహిళల జీవన శైలి, ఆరోగ్య పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వారి జీవన విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మహిళలు తీసుకోవాల్సిన పోషకాహారం, పాటించాల్సిన పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తిని పాటిస్తూ ప్రతిఒక్క మహిళ తన ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తూ కుటంబాన్ని సంరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నరేష్, ఆశ కార్యకర్త రేణుక, అంగన్వాడీ టీచర్ నాగమణి, విఓ ఉమ, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాల్టీలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కమీషనర్ కె.సుజాత తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జూన్ 2 నుండి వందరోజుల ప్రత్యేక ప్రణాళికలు చేపట్టనున్నట్లు తెలిపారు. వచ్చేది వర్షాకాలం కావటంతో అందుకు సీజనల్ వ్యాధుల నివారణ, అభివృద్ధి పనులు తదితర అంశాలపై ప్రణాళికలు ముందస్తుగా సిద్ధం చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా పచ్చదనం, పరిశుభ్రత, రోడ్ల మరమ్మతులు, మహళా సంఘాల ఏర్పాటు, తడి పొడి చెత్త సేకరణ, కాలువల్లో పూడికతీత వంటి అంశాలతో పాటు శిథిలమైన భవనాలు, బావులు గుర్తించి వాటిని నిర్వీర్యం చేయటం తదితర అంశాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. అంతేకాకుండా ఘన వ్యర్థాలపై ప్రచారం, తాగునీటి కనెక్షన్లు, నూతన భవనాల ఇంటి కొలతలు, గృహాల అనుమతులు, రహదారులపై గుంతల పూడ్చటం వంటి పనులు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ వంద రోజుల ప్రణాళిక కార్యక్రమానికి ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, యువకులు పాల్గొని మున్సిపాల్టీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/వైరా:** జూన్2న జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆ వేడుకల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని వైరా మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు అన్నారు. గురువారం కమీషనర్ చింతా వేణు మున్సిపాల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్2 నుంచి సెప్టెంబర్9 వరకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్నారు. కాల్వల పూడికతీత, రోడ్లను శుభ్రపరచడం, మొక్కలను నాటుటూ, అంటువ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర అవతరణ వేడుకలు ఒక పండుగలా నిర్వహించాలని దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మూర్తి, వెంకట్రావు, పలు మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

# డివైఎఫ్ఐ యువ చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/వైరా:** డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా జరగబోయే యువ చైతన్య సైకిల్‌యాత్రను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ వైరా పట్టణ కార్యదర్శి నాగుల్‌పాషా అన్నారు. గురువారం వైరా పట్టణ ప్రచారంలో భాగంగా స్థానిక బోడేపూడి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాగుల్‌పాషా మాట్లాడుతూ చెడు వ్యసనాలు వద్దు పోరాటాలే ముద్దు అనే నినాదంతో మే30వ తేదీన ఎర్రుపాలెం మండలం జమలాపురంలో డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా యువ చైతన్య సైకిల్ యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. డివైఎఫ్ఐ యాత్ర బృందం జూన్8వ తారీఖు వైరా పట్టణంలోకి వస్తుందని, వైరా మండలంలో ఉన్న యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనియువత చైతన్య సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

# మహిళా మార్ట్‌ను లాభాల బాటలో నడపాలి

**-వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలి**
**-మార్ట్‌ను సందర్శించిన ఉమ్మడి ఖమ్మంజిల్లా కలెక్టర్లు**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం మహిళా మార్ట్ ప్రత్యేకత చాటే విధంగా మార్ట్ నిర్వహణకు మహిళా సంఘాలు బాధ్యత వహించాలని లాభాల బాటలో నడిపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం వైరా రోడ్డు నందు నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, కొత్తగూడెం జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్, ఖమ్మంజిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్‌తో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. మహిళా మార్ట్ ఏర్పాటుకు దోహదపడిన పలు అంశాలు, మార్ట్ యొక్క ఉద్దేశం, విక్రయించే ఉత్పత్తులు, ఖమ్మం బ్రాండింగ్ విలువ పెంచేందుకు తీసుకున్న చర్యల వంటి పలు అంశాలను వారికి జిల్లా కలెక్టర్ వివరించారు. మార్ట్‌లో ఏర్పాటు చేసిన వస్తువులను, ఉత్పత్తులను పరిశీలించి తృణ ధాన్యాలు, పప్పులను మహిళలు ప్యాకింగ్ చేసే విధానాన్ని ఆసక్తిగా వారు తిలకించారు. దూప్‌స్టిక్, అగరుబత్తీలు వేటితో తయారు చేశారని మహిళలను అడిగి తెలుసుకున్నారు. పలు ఉత్పత్తులను కలెక్టర్లు, సిపి, ఎస్‌పి, డిఎఫ్‌వో లు కొనుగోలు చేశారు. మార్ట్ బాగుందని కితాబునిస్తూ వ్యాపార అనుకూలతకు మహిళా నిర్వాహకులకు పలు సూచనలు అందించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళలు అనేక రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించే వేదికగా మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. సమీకృత మార్కెట్‌లో కూడా ఓ స్టాల్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు ఆన్‌లైన్‌లో కూడా మహిళా ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ మహిళా ఉత్పత్తుల విక్రయానికి మంచి కేంద్రాన్ని మార్ట్ రూపంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ మార్ట్‌లో మహిళల ఉత్పత్తులను పెద్ద మొత్తంలో ఏర్పాటు చేయాలని డిఆర్‌డిఏ అధికారులకు సూచించారు. అటవీ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మార్ట్‌లో అవకాశం కల్పించాలని వాటి ద్వారా మహిళలకు మరింత లాభం చేకూరేందుకు వీలుంటుందన్నారు. అనంతరం మహిళా మార్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను ఉన్నతాధికారులు సందర్శించి అక్కడ టీ సేవించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామయ్యను దర్శించుకున్న సీతక్క



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచల శ్రీసీతారామ చంద్ర స్వామివారి ఆలయాన్ని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ,శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ సీతక్క, మహిళ శిశు సంక్షేమశాఖా ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్‌తో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ మర్యాదల ప్రకారం ఇఓ రమాదేవి ఘనస్వాగతం పలికారు. గర్భగుడిలోని స్వామిని దర్శించుకున్న మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ తాయారమ్మ, శ్రీ అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. షాలువాకప్పి సన్మానించి ఆలయం తరుపున స్వామివారి ప్రతిమను బహుకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట భద్రాచలం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావుతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులున్నారు.

# టాయిలెట్స్ కడిగితే తప్పేంటి అనడం బాధాకరం

**-వర్షిణిని విధుల నుంచి బహిష్కరించాలి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** టాయిలెట్స్ కడిగితే తప్పేంటి అంటూ గురుకుల విద్యార్థుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన అలుగు వర్షిణిని విధుల నుంచి బహిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గురుకులాల్లో చదివే విద్యార్థులతో పనులు చేయించుకుంటాం, వాళ్లు వాడే టాయిలెట్లను వారే కడుక్కుంటే తప్పేంటి అనడం బాధాకరమన్నారు. విద్యార్థులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. గురుకులాల్లో చదివే విద్యార్థులు ఆర్థిక స్థోమత లేని దళిత విద్యార్థులు కావడంతోనే ఆమె చులకనగా మాట్లాడారని ఇది రాజ్యాంగ విలువలను దిగజార్చడమేనన్నారు. తల్లిదండ్రులు అడిగితే విద్యార్థుల ముందే షోకాజ్ నోటీసులు ఇవ్వమని చెప్పడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. విద్యార్థులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సోషల్ వెల్ఫేర్ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణిని తక్షణమే విధుల నుంచి బహిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# విద్యార్థులు లేరనే సాకుతో గురుకులాల మూసివేత తగదు

**-వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టికి వినతి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్సి గురుకులాల్లో జూనియర్ కాలేజీల మూసివేత నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐఎస్‌ఎఫ్‌జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తుండు ప్రవీణ్, జార్డ్‌రెడ్డి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు మందా సురేష్‌లు మాట్లాడుతూ పేద విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ పరిధిలోని 12 గురుకులాల్లో ఇంటర్మీడియట్ కళాశాలలను ఎత్తివేయాలనే నిర్ణయాన్ని తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో కూసుమంచి బాలికలు, సత్తుపల్లి బాలురు, భద్రాచలం బాలికల ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యార్థులు లేరనే సాకుతో మూసివేత నిర్ణయం తగదన్నారు. కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఇంటర్ చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులు గురుకులాలు ఎంతో ఆసరాగా నిలిచాయన్నారు. గురుకుల కళాశాలలను ఎత్తివేయడం పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనన్నారు. తక్షణమే ఎత్తివేత నిర్ణయాన్ని విరమించుకోవాలని లేనిపక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాలతో పాటు కలిసి వచ్చే సంఘాలను కలుపుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు గోపీత్రినాథ్, ఉదయ్, విజయ్, అజయ్, ప్రతాప్, రాకేష్ తదితరులు ఉన్నారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మధిర సీనియర్ సివిల్ జడ్జి ఎన్.ప్రశాంతి సూచించారు. యువత బంగారు భవిష్యత్ కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన యువ చైతన్య సైకిల్‌యాత్రను గురువారం జమలాపురం గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా తాము అనుకున్న లక్ష్యాలను సాధించి ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ యువత చెడు వ్యాసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, యువత బంగారు భవిష్యత్‌తకు బాటలు వేసుకోవాలనే ధ్యేయంతో యువ చైతన్య సైకిల్‌యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. మొదటి రోజు జమలాపురంలో ప్రారంభమై బంజర, కంద్రిక, తెల్లపాలెం, ఎర్రుపాలెం, మీనవోలు గ్రామాల నుండి జిల్లా వ్యాప్తంగా సైకిల్‌యాత్ర సాగుతుందని, ఈ యాత్రలో పెద్ద ఎత్తున యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం తహశీల్దార్ మన్నే ఉషాశారద, మధిర సిఐ డి.మధు, మండల వైద్యాధికారి ప్రశాంత్, ఎక్సైజ్ సిఐ జె.రామ్మూర్తి, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజడ్ల పుల్లారవు, ఎంఇఓ మురళీమోహన్‌రావు, స్థానిక ఎస్సై ఆర్.రమేష్ తతదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

**ప్రజాపక్షం/గుండాల :** ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న క్రమంలో మండలంలోని వ్యాపారులు నికిలీ విత్తనాలు పరుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పిఓ వెంకటరమణ, సిఐ రవీందర్‌లు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఎరువులు, పురుగుమందు షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను రిజిష్టర్లను, ధరల పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు రైతులకు విక్రయించి మోసాలకు పాల్పడరాదని, అవుట్‌డేటెడ్ స్టాక్ విక్రయించరాదని చెప్పారు. రైతులు ఎరువులు, విత్తనాలు, పు రుగుమందులకు సంబంధించి బిల్లులు తీసుకోవాలని, నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకుని సాగు చేసుకోవాలని,వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని అన్నారు. బయటి నుండి నకిలీ విత్తనాలు తీసుకొచ్చిన వారి సమాచారాన్ని తమకు అందించాలని తెలిపారు. తనిఖీల్లో ఎక్సై సైదా ఫరూఫ్, ఏఓలు,ఏఇఓలు,లెనిన్,బాలరాజు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మొదట విగ్రహదాత గడ్డిపాట్టి సత్యం ని కొనియాడారు ఎన్టీఆర్ గొప్పతనాన్ని, తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను, సినీ, రాజకీయ రంగాలలో ఆయన సాధించిన గొప్ప విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఇంత భారీగా ప్రజలు తరలి వచ్చారంటే అన్నగారి పట్ల ప్రజలకు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది అన్నారు. ఆయన స్వర్గస్థులై 30 ఏళ్లవుతున్నా.. ఆయన పట్ల ప్రజలకు అదే అభిమానం, ఎన్టీఆర్‌లాంటి నాయకులు మరొకరిని ఊహించలేం అన్నారు. ఎన్నేళ్లయినా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోతారన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చి రాజకీయానికి సరికొత్త అర్థం చెప్పారన్నారు. వాటిని ఇప్పటికీ పాలకులు అనుసరించడం ఎన్టీఆర్ దార్శనికతకు నిదర్శనం అన్నారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా జరిపిన టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కట్ర స్వామి దొర మాట్లాడుతూ సినీరంగంలో చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్, తెలుగు రాజకీయాలను కొత్త మలుపు తిప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, టిడిపి సీనియర్ నాయకులు, ఎన్టీఆర్ విగ్రహ దాత గడ్డిపాటి సత్యం, దమ్మపేట మండల టిడిపి వలి పాషా, టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ కట్రమ్ స్వామి దొర, ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రాజకీయాలకు అతీతంగా అని పార్టీల కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# 45 రోజుల లోపు ఇంటి నిర్మాణం చేపట్టాలి

**-మున్సిపల్ కమీషనర్ నరసింహ, గృహ నిర్మాణ శాఖ ఏఈ పవన్**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం అందిన 45 రోజుల లోపు ఇంటి నిర్మాణం మొదలు పెట్టాలని స్పష్టం చేశారు మున్సిపల్ కమీషనర్ నరసింహ, గృహ నిర్మాణ శాఖ ఏఈ పవన్ లు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కే నరసింహ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం అందిన 45 రోజులలోపు ఇంటి నిర్మాణం మొదలు పెట్టాలని, బేస్మెంట్ స్థాయికి రూ.లక్ష , గోడల నిర్మాణానికి రూ.లక్ష , స్లాబ్ పూర్తయ్యాక రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష చొప్పున మొత్తం ఐదు విడతలలో రూ.5 లక్షలు నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేయబడతాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి కొలత ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ పవన్, మున్సిపల్ మేనేజర్ మైసూర్ శ్రీనివాస్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.